## క్లుప్తంగా

### గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లావణ్య

**గంగవరం:** స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లావణ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలో వివిధ కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించవచ్చని ఆమె అన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, చదరంగం, యోగా, ధ్యానం..ఇత్యాది వాటిల్లో శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీకాంత్ రెడ్డి ఆమెకు చెప్పారు.

### కేతు విశ్వనాథ రెడ్డి మరణం సాహితీ లోకానికి తీరని లోటు

**పలమనేరు:** రాయలసీమ సీనియర్ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కేతు విశ్వనాథ రెడ్డి మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలమనేరు రచయితల సంఘం అధ్యక్షులు బాలాజీ సంతాపం వ్యక్తం చేశారు. ఒంగోలులో ఆయన గుండెపోటుతో మృతి చెందడం విషాదకరమన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రచయితల సంఘ గౌరవాధ్యక్షులు మాధవరెడ్డి, తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, జేవీవీ నాయకులు యుగంధర్, కుమారస్వామి రెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, దొర్నాధుల సిద్ధార్థలు పాల్గొన్నారు.

### భూసార పరీక్షలతోనే ఎరువుల వినియోగం

**సోమల:** భూసార పరీక్షల ఫలితాల మేరకే రైతులు ఎరువులను వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న సూచించారు. మండలంలోని ఇరికిపెంట ఆర్బీకేలో సోమవారం అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వేరుశెనగ విత్తడానికి ముందు విత్తనాలను శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులకు శిక్షణ



భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ చేస్తున్న అధికారులు

**పలమనేరు:** మండలంలోని టి.వడ్డూరు రైతుభరోసా కేంద్రంలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు సమయాత్తంపై సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అగ్రికల్చర్ డీడీఏ గోపాల్ మాట్లాడుతూ, కలుపు మొక్కల నివారణలో భాగంగా రైతులకు ఇబ్బందిగా మారిన పార్థీనియం మొక్కలను రైతులు సామూహికంగా నిర్మూలించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. విత్తనశుద్ధి చేయాలని, వేసవిలో లోదుక్కులతో కలిగే మేలును వివరించారు. రైతులు సేంద్రియ వ్యవసాయ విధానాలు పాటించాలని కోరారు. భూసార పరీక్షలకు మట్టిని ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా చూపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి సంధ్య, వీఏఏ గఘున సింధు, మహేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

### యువకుడు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన అస్లాం

**పుంగనూరు :** పట్టణంలోని నక్కబండలో నివాసమున్న అస్లాం(35) యువకుడు పెట్రోల్‌తో నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... సెంట్రింగ్ పనులు చేస్తున్న అస్లాం తన భార్యకు ఫోన్ చేసి పనులు లేవని తెలిపాడు. భోజనానికి ఇంటికి రావాలని భార్య కోరినా అస్లాం ఇంటికి రాకుండా నక్కబండ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ సాయంత్రం నిప్పంటించుకున్నాడు. ఇది గమనించి ఆ ప్రాంత వాసులు అస్లాంను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. న్యాయమూర్తి అతడి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి ఎందుకు ఒడిగట్టాడో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# వలంటీర్లకు సేవా పురస్కారాలు



వలంటీర్లకు సేవా పురస్కారాలను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

**పలమనేరు :** మండలంలోని కొలమాసనపల్లె సచివాలయ పరిధిలోని 33మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలను సోమవారం పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రదానం చేశారు. ప్రజలు–ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసే వలంటీర్లను ప్రభుత్వం సన్మానించడం ఆనందదాయకమన్నారు. తొలుత గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రారంభించారు. టీడీపీ పాలనలో సాగిన దోపిడీని జనం చూశారని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో సాగుతున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని జనం గమనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక, మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు రంగన్న, చెంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి, సచివాలయాల కన్వీనర్ తిరుమలేష్, గ్రామ సర్పంచ్ గోవిందప్ప, ఎంపీటీసీ సభ్యురాలు మేనక, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, పంచాయతీ నాయకులు మనోజ్‌రెడ్డి, వీరభద్ర, అమరనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**నేడు దుగ్గినవారిపల్లెలో గడప గడపకు..**

కొలమాసనపల్లె పంచాయతీలోని దుగ్గినవారిపల్లె, మారుమూరు, కూర్మాయి, బేలుపల్లె క్రాస్, సాకేపూరులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని కన్వీనర్ బాలాజీ నాయుడు తెలిపారు.

**24 నుంచి మున్సిపాలిటీలో...**

మున్సిపాలిటీలోని 26, 25 వార్డుల్లో ఈనెల 24న, 25న 24 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

**ముఖ్యమంత్రికి మంచి పేరు తెద్దాం**

**కుప్పం:** దేశంలోనే ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, ఈ వ్యవస్థలో4 లక్షల ఉద్యోగాలు ఇచ్చి పెద్ద సంఖ్యలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కిందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆయనకు ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాసేవ చేసి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. సోమవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ చేతుల మీదుగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ప్రతి విషయానికి లబ్ధిదారులు జిల్లా, మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇళ్ల ముంగిటకే పథకాలను వలంటీర్లు చేరుస్తున్నారని, వారి సేవలను గుర్తించి ప్రభుత్వం సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ,



కొలమాసనపల్లెలో నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాయకుల సిఫార్సులతో పథకాలు అందేవని, ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థతో సరికొత్త శకానికి సీఎం శ్రీకారం చుట్టారన్నది అందరికీ తెలిసిందేనన్నారు. కార్యక్రమంలోఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ శరవణ, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మోజీ, ఎంపీడీఓ జానకమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కల్లూరు పంచాయతీలో వలంటీర్లకు సన్మానం

**కల్లూరు పంచాయతీలో..**

**పులిచెర్ల(కల్లూరు):** కల్లూరు పంచాయతీలోని వలంటీర్లను సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీలో 42మంది వలంటీర్లలో ఒకరికి సేవారత్న, 36మందికి సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. వారి సేవలను ప్రస్తుతించారు. సర్పంచ్ షుకూర్, కాణిపాక ట్రస్టు బోర్డు సభ్యులు మువ్వల నరశింహులు శెట్టి, కల్లూరు ఈఓ యుగంధర్, వైఎస్సార్ సీపీ నాయకులు మునిరత్నం, మహమ్మద్ ఆరీఫ్, బావాజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.కోటితో సిమెంటు రోడ్ల నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న సర్పంచ్ మురళీకృష్ణ

**రామకుప్పం:** మండలకేంద్రం రామకుప్పంలో సుమారు రూ.కోటి నిధులతో సిమెంటు రోడ్డు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం రామకుప్పంలోని దిగువవీధిలో సిమెంటు రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. పట్టణవ్యాప్తంగా త్వరలోనే అన్ని సిమెంటు రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జమీను ప్రసాద్, అబ్దుల్, గోపీకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు అప్పి, నేతలు తజీముల్ పాషా, వెంకటాచలపతి, శంకర్, యశ్వంత్ రెడ్డి, నటరాజ్, బాబు పాల్గొన్నారు.

### పీఎంకేవై నమోదు తప్పనిసరి

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని రైతులు పీఎం కిసాన్ యోజన కింద తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలో 460 మంది రైతులు పీఎంకేవై చేసుకోవాల్సి ఉందన్నారు. సమీప ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి త్వరగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

# 5వ సచివాలయ పరిధిలోకి నక్కబండ



మాట్లాడుతున్న కమిషనర్, చైర్మన్ తదితరులు

**పుంగనూరు:** మండలంలో ఉన్న నక్కబండ ప్రాంతాన్ని మున్సిపాలిటీలోని 5వ సచివాలయ పరిధిలోకి చేర్చినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, 15వ వార్డు కౌన్సిలర్ మనోహర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో తొలి సమావేశం సోమవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నక్కబండ పట్టణంలో కలిసి ఉండడంతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీలో చేర్చాలని సూచించినట్లు చెప్పారు. సుమారు 2300 మంది జనాభా కలిగిన నక్కబండలో ప్రభుత్వ సేవలను 5వ సచివాలయం నుంచి అందించనున్నట్లు వెల్లడించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు నక్కబండలో వేగవంతం చేశామన్నారు. రోడ్లు, కాలువలు, దాదాపుగా పూర్తికావస్తున్నాయని వివరించారు. కౌన్సిలర్ మనోహర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో చేరిన నక్కబండలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. మున్సిపాలిటిలో చేర్పించినందుకు మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సచివాలయ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వర స్వామి

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామివారికి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పాలాభిషేకం అనంతరం హోమ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# నగరంలో విస్తృతంగా ‘మేరీ లైఫ్’



అవగాహన కార్యక్రమంలో సిబ్బంది

**చిత్తూరు అర్బన్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ‘మేరీ లైఫ్’ కార్యక్రమాలను నగరంలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ అన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ‘మేరీ లైఫ్’ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను భాగస్వాములను చేస్తూ వివిధ రకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఒక్కో రోజు ఒక్కో అంశంతో క్షేత్రస్థాయిలో వార్డు కార్యదర్శులు కార్యక్రమాల నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. అందులో భాగంగా నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సోమవారం స్థానికంగా, సీజనల్‌గా లభించే ఆహార పదార్థాలు, పండ్లు ఉపయోగాలను వివరించారు. నగరంలో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ కేంద్రాలను ఏర్పాటు చేసి గృహాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సేకరిస్తున్నారని చెప్పారు.

### వజ్రాలపురం గంగమ్మ జాతర ప్రారంభం



**బంగారుపాళెం:** మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన, ధ్వజారోహణ, గణపతి హోమం, చండీహోమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 11 గంటలకు భక్తి సంకీర్తనలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, దీప, గోపి, చాతుర్య, పురుషోత్తం, కొమ్మినేని ఉషా, నరేష్, మమత, ఈశ్వర్‌నాయుడు, శివలింగయ్య, ఉభయదారులుగా వ్యవహరించారు. మంగళవారం అమ్మవారికి అంబలి, పొంగళ్లను సమర్పించనున్నారు. అనంతరం అమ్మ నిజరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నీటి నిల్వపై అవగాహన అవసరం



పుత్రమద్దిలో చెరువు పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

**ఐరాల:** నీటి నిల్వ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు సచింద్రకుమార్‌సింగ్, సోమరేంద్రసింగ్ అభిప్రాయపడ్డారు. మండలంలోని కాణిపాకం, వడ్రాంపల్లె, చిన్నకాంపల్లె, పుత్రమద్ది, వేదగిరివారిపల్లెలో సోమవారం వారు పర్యటించారు. వారు ఎన్ఆర్ఈజీఎస్ పథకం, ఇరిగేషన్ కింద చేపట్టిన వ్యవసాయ చెరువు, అమృత్‌సరోవర్, కందకాల పనులను పరిశీలించారు. ముందుగా కాణిపాకం అవెన్యూ ప్లాంటేషన్‌ను సందర్శించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు ఏపుగా పెరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టడం ద్వారా నీటి నిల్వ ప్రాధాన్యతలో సాధించిన అభివృద్ధిపై అభినందించారు. అనంతరం వేదగిరివారిపల్లెలో అమృత్ సరోవర్ కింద చేపట్టిన చెరువు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నీటినిల్వ కోసం కందకాల పనులు, ఇంకుడు గుంతలు మెరుగైన ఫలితాలిచ్చాయని తెలిపారు. డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ సునీల్‌కుమార్, ఏపీఓ సంధ్య పాల్గొన్నారు.

# పథకాల అమలులో రాష్ట్రం మొదటి స్థానం



అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్సీ భరత్

**రామకుప్పం:** సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. మండలంలోని ఉన్సిగానిపల్లె పంచాయతీలోని గోవిందపల్లె, జౌకుపల్లె, మొరవఇండ్లు, లింగాపురం గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన ప్రజలతో పైవిధంగా మాట్లాడారు. ప్రజా సంక్షేమం, సంక్షేమ పథకాల అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని, అలాగే రాష్ట్రంలో పారిశ్రామికరంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

**అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం**

మండలంలోని బల్ల గ్రామం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఇచ్చిన హామీ మేరకు సోమవారం స్థానిక నేత, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు థామస్‌కు రూ.70 వేలను అందజేశారు. అలాగే కుప్పం రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ రూ.50 వేలను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు సులోచన, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ లలిత, మండల కో–ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రాధాకృష్ణ, స్థానిక నేతలు దాము, గుర్రప్ప, ప్రకాష్, జగదీష్, మణికంఠ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# పట్టు రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పట్టు రైతులు

- ఇన్‌సెంటివ్స్ ఇవ్వాలని డిమాండ్

**పలమనేరు:** తమకు పట్టు పరిశ్రమశాఖ ఇన్‌సెంటివ్స్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని పట్టు రైతులు సోమవారం పలమనేరులో ఆందోళన చేశారు. స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రం నుంచి ఏటీఎం సర్కిల్ వరకూ ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ, పట్టుగూళ్ల రైతులకు ప్రోత్సాహకంగా కిలో పట్టుగూళ్లకు రూ.50 ఇస్తున్నారన్నారు. గత 19 ఏళ్లుగా ఇస్తున్న ఇన్‌సెంటివ్‌ను 2018 నుంచి ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోనే రూ.7 కోట్ల వరకూ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు మల్బరీ షెడ్ల నిర్మించిన వారికి బిల్లులు ఆలస్యమవుతున్నాయన్నారు. మల్బరీ రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఉపాధి పనులు సైతం నిలిచిపోయాయన్నారు. పట్టు రైతులతో ఆ శాఖ కమిషనర్ సమావేశాలు నిర్వహించడం లేదని, ఉన్నతాధికారుల సలహాలు–సూచనలు లేక రైతులకు ఇబ్బందిగా ఉందని వాపోయారు. పట్టు రైతులు ఏడూరు గురుమూర్తి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ముంపు రైతులను ముంచింది చంద్రబాబుదే

**రొంపిచెర్ల:** చల్లంపల్లె ప్రాజెక్టు నిర్మాణంలో ముంపు రైతులను ముంచిన ఘనత మాజీ సీఎం చంద్రబాబుదేనని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి చెప్పారు. వారు మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం మంజూరు చేయలేదని గుర్తుచేశారు. స్థానిక టీడీపీ నాయకులు కూడా ఎప్పుడూ పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పుడు మాత్రం పరిహారం ఇవ్వలేదని ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. అప్పట్లో పరిహారం విడుదల చేయకుండా ఐదేళ్లు తొక్కిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రూ.1.3 కోట్ల పరిహారం కోసం ప్రతిపాదనలు పంపితే రైతులు చాలా తక్కువ ఇస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. మంత్రి మళ్లీ రూ.1.3 కోట్లను ఎనిమిది రెట్లు రూ.8.92 కోట్లకు పెంచి వడ్డీతో చెల్లించాలని ప్రభుత్వానికి సూచించారని తెలిపారు. అయితే ఇది జీర్ణించుకోలేని కొందరు కావాలనే మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇబ్రహీంఖాన్, శ్రీనాథ్, సదాశివ రెడ్డి, కుమార్‌నాయుడు, రామకృష్ణనాయుడు, చంద్రయ్యనాయుడు, సూర్య నారాయణ రెడ్డి, కరీముల్లా, బాలాజీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

# గంగ జాతరకు భారీ బందోబస్తు



మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి

**కుప్పం:** కుప్పంలో జరుగుతున్న తిరుపతి గంగమ్మ జాతరకు మూడు రోజులు భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం కుప్పం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం అమ్మవారి అగ్ని గుండ ప్రవేశం, మంగళవారం శిరస్సు ఊరేగింపు, బుధవారం విశ్వరూప దర్శనానికి భక్తులు అధికంగా రావడంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముగ్గురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 23 మంది ఎస్ఐలు, 350 మంది పోలీస్ సిబ్బంది, 18 మహిళా సిబ్బందితో బందోబస్తు కల్పించినట్లు చెప్పారు. పట్టణానికి నలు దిక్కుల్లో అక్కడిక్కడే పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే 50 సీసీ కెమెరాలు పట్టణంలో అమర్చినట్లు ఆయన తెలిపారు.

# కలసికట్టుగా పని చేద్దాం



మంత్రిని కలిసిన ఎంపీ రెడ్డెప్ప,ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నాయకులు

**పూతలపట్టు(యాదమరి):** అందరు కలసికట్టుగా పనిచేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పూతలపట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకులను కోరారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో సోమవారం సాయంత్రం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో మండల నాయకులు మంత్రి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధిపనులు, సమస్యలపై చర్చించారు. మండలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తలపులపల్లె బాబురెడ్డి, కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# మొగిలీశ్వరున్ని సేవలో జెడ్పీ చైర్మన్

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలీశ్వర స్వామిని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ దేవర కొండపై వెలసిన శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.